రేవంత్.. భాష మార్చుకో..

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, నవంబర్ 9 : సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బుల్డోజర్లతో తొక్కిస్తా.. కుక్క చావు చస్తావ్ అంటూ పిచ్చిగా మాట్లాడటాన్ని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి భాష గీత దాటిపోతున్నది. ప్రజాస్వామ్యంలో ఇలాంటివాటికి చోటు లేదన్నారు. మార్పు వస్తుందని ఆశించిన వారికి నిరాశ మిగిలింది.. పైగా ఇప్పుడు నీ భాష చూసి సాధారణ ప్రజలు కూడా విరక్తి చెందుతున్న పరిస్థితి కనిపిస్తున్నదన్నారు. రాజకీయాల్లో హుందాతనాన్ని ప్రజలు కోరుకుంటారు కాని, ఇలాంటి తిట్లుకాదు. తాత్కాలికంగా కొంతమంది సంతోషపడవచ్చు కానీ.. దీర్ఘకాలంలో రాష్ట్ర ప్రయోజనాలు, ప్రతిష్ట దెబ్బతిని ఎనలేని నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. మీ పార్టీ నాయకులు కూడా మీ బాటను అనుసరిస్తే రాష్ట్ర రాజకీయాల్లో తిట్ల పురాణాలు మాత్రమే వినిపిస్తాయని మండిపడ్డారు. దయచేసి ప్రజల కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇప్పటికైనా మీ భాష మార్చుకుంటే మంచిది.. లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని ఆనంద్ హెచ్చరించారు.

జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్

వికారాబాద్, నవంబర్ 9 : రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో శివారెడ్డిపేట్‌లో 133, 134 పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన యువత తప్పక ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్ట్‌లో మార్పులు చేర్పులు తదితర అంశాల కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వో అధికారులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఓటర్‌గా నమోదుకు నేడు, రేపు బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓటర్ జాబితాలో తమ పేరు ఉందో లేదో చెక్ చేసుకోవాలని, ఓటర్‌గా పేరు లేకుంటే ఫారం 6 ద్వారా పోలింగ్ బూత్‌లో ఉన్న బీఎల్‌వో వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌లలో బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకునేవారు రెండు ఫొటోలు, నివాస, వయస్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రావాలన్నారు. ఆన్‌లైన్‌లో www.nvsp.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటర్ నమోదు సమాచారం కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, బీఎల్‌వోలు స్వరూప, అనురాధ పాల్గొన్నారు.

రేపటి నుంచి 14 వరకు జోనల్ స్పోర్ట్స్ పోటీలు

వికారాబాద్, నవంబర్ 9 : వికారాబాద్‌లో ఈ నెల 11 నుంచి 14 వరకు 10వ జోనల్ స్పోర్ట్స్, గేమ్స్ నిర్వహించనున్నట్లు టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ శివారెడ్డిపేట బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని అనంతగిరిపల్లి సమీపంలో ఉన్న టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ శివారెడ్డిపేట బాలుర పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని 12 పాఠశాలల విద్యార్థులు పదవ జోనల్‌స్థాయి పోటీల్లో 1000 మంది విద్యార్థులు, 300 మంది పీఈటీ, పీడీలు పాల్గొంటారన్నారు. అండర్ 14, 17, 19 విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్, టెన్నికాయిట్, ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య పాల్గొంటారని, వీరితోపాటు కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఆయా శాఖల అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. చివరి రోజు పోటీలకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. రీజినల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగనుండగా, స్పోర్ట్స్ ఇన్‌చార్జిగా చందర్ ఉంటారన్నారు.

చింతపట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత

కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్‌డీఓ శ్రీలత
- నందివనపర్తి, చింతపట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

యాచారం, నవంబర్ 9 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి శ్రీలత సూచించారు. మండలంలోని నందివనపర్తి, చింతపట్ల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి గ్రేడ్-ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 మద్దతు ధరను కల్పించనున్నట్లు తెలిపారు. ఆరబెట్టి, చెత్తాచెదారం, తేమ లేకుండా ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలతో పాటు అవసరమైన గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల అధికారులు రైస్‌మిల్లర్లతో ఎప్పటికప్పుడు సమన్వయంతో ఉంటూ కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. ఏరోజు ధాన్యాన్ని అదే రోజున కొనుగోలు చేసేందుకు అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. వరి ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు.

సర్వే పక్కాగా చేపట్టాలి

మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పక్కాగా చేపట్టాలని శ్రీలత సూచించారు. మండలంలోని చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో పర్యటించి సర్వే నిర్వహిస్తున్న తీరును ఆమె స్వయంగా పరిశీలించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో మాట్లాడి సర్వే సాగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సర్వేలో కుటుంబ యాజమాని, కుటంబసభ్యుల పూర్తి వివరాలను సేకరించాలని సూచించారు. సర్వే ఫారాలను తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం నరసింహారావు, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, వ్యవసాయాధికారి రవినాథ్, అధికారులు, ఎంపీవో శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

బీఎల్‌వోల నుంచి వివరాలను సేకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

కొడంగల్, నవంబర్ 9 : ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ప్రత్యేక క్యాంపులో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ శనివారం పట్టణంలోని పోలింగ్ బూత్‌ను సందర్శించి పరిశీలించారు. 18 సంవత్సరాలు పైబడ్డ యువత ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపును సద్వినియోగం చేసుకొని ఓటు హక్కును పొందేలా సహకరించాలని బూత్ లెవల్ అధికారులకు సూచించారు. బూత్‌ల వారీగా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని.. శనివారం, ఆదివారం నిర్వహించే క్యాంపును సద్వినియోగం చేసుకునేలా సహకరించాలని తెలిపారు. సంబంధిత బూత్ అధికారులు విధిగా తమతమ బూత్‌లలో అందుబాటులో ఉండి నమోదుతో పాటు మార్పులు, చేర్పుల వంటి వాటికి ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

యాలాల, నవంబర్ 9 : రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటన శనివారం ఉదయం కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా కమలాపురం వద్ద జరిగింది. రాష్ట్రంలోని వనపర్తి జిల్లాకు చెందిన భార్గవ్‌కృష్ణ(55) హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో నివాసముంటున్నాడు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాలను కుటుంబసమేతంగా చూసే క్రమంలో భార్య సంగీత(45), కుమారుడు ఉత్తమ్ రాఘవ(28)లతో దత్తాత్రేయ క్షేత్రానికి వెళ్తున్నారు. గుల్బర్గా జిల్లా కమలాపురం వద్దకు రాగానే ఎలాంటి డివైడర్లు లేకపోవడంతో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టగా భార్గవ్‌కృష్ణ, భార్య సంగీత, కుమారుడు ఉత్తమ్ రాఘవతో పాటు డ్రైవింగ్ చేస్తున్న రాఘవేందర్‌గౌడ్ అక్కడికక్కడే మృతిచెందారు. రోడ్డు ప్రమాదంపై దర్యాప్తు చేపట్టాలని కర్ణాటక సరిహద్దు జిల్లా వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డిని డీజీపీ జితేందర్ ఆదేశించారు. గుల్బర్గా జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ దర్యాప్తులో ముందుకు సాగాలని కరణ్‌కోట్ ఎస్సై విఠల్‌రెడ్డిని ఎస్పీ ఆదేశించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కరణ్‌కోట్ పోలీసులు కర్ణాటక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆసుపత్రికి తరలించడమే కాకుండా బంధువులకు సమాచారమిచ్చి ఎఫ్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేశారు.

తొలి రోజు 7771 కుటుంబాల సర్వే

పరిగి, నవంబర్ 9 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే శనివారం నుంచి ప్రారంభమైంది. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లావ్యాప్తంగా మొదటి రోజు 7771 కుటుంబాల సర్వే చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామాలు, మున్సిపాలిటీలలో ఏకకాలంలో సర్వే చేపట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో ఈ నెల 6నుంచి 8 వరకు కుటుంబాలను గుర్తించి స్టిక్కరింగ్ చేపట్టారు. శనివారం నుంచి ప్రతి కుటుంబం వివరాల సేకరణ ప్రారంభమైంది. ఈ సర్వేను ఈ నెల వరకు చేపట్టనున్నారు. వికారాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 263362 కుటుంబాలుండగా ప్రతి ఎన్యూమరేటర్ 175 కుటుంబాలకు సంబంధించిన సర్వే చేపట్టాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 2024 మంది ఎన్యూమరేటర్లు, 208 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో మొదటి రోజు 7771 కుటుంబాల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబసభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆస్తులు, భూములు, ఇతర అన్ని అంశాలకు సంబంధించి 75 ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొని వివరాలు ఫారాలలో నమోదు చేశారు.

బీఎఫ్‌ఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ) (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ) కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, నాలుగు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 19వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 26వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ డేటా సైన్స్ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

సర్వేపై సందేహాలుంటే నివృత్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌లకు సూచించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సర్వేపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

వికారాబాద్, నవంబర్ 9 : సర్వేపై ప్రజల కున్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియపై క్యాంపు కార్యాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరై కలెక్టర్లు ఎన్యూమరేటర్లలతో కలిసి నిరంతర పర్యవేక్షణపై సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడీవోసీ కార్యాలయం నుంచి కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. హౌస్ లిస్టింగ్ పూర్తి చేసుకుని శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో కలెక్టర్లు ఎన్యూమరేటర్లతో పకడ్బందీగా నమోదు చేయించాలని తెలిపారు. సర్వేలో ప్రజలకు సందేహాలు వస్తే నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో భాగస్వాములయ్యేలా వారిని ఆహ్వానించాలని తెలిపారు. ఈ సర్వే చాలా మంచి కార్యక్రమమని.. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడుతుందని వివరించారు. హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించారని, అదే ఉత్సాహంతో సర్వే ఆసాంతం పూర్తయ్యే వరకు పకడ్బందీగా నిర్వహించాలని భట్టి తెలిపారు.

సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళుతున్న కలెక్టర్లు, ఎన్యూమరేటర్లు, ప్రణాళికా శాఖ అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. దేశంలో ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వచ్చిన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. సర్వే సమాచారం గ్రామస్థాయిలోని చిట్టచివరి ఇంటికి చేరేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్లతోపాటు అన్ని స్థాయిల అధికారులు సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ సిబ్బందికి తగు సలహాలు, సూచనలివ్వాలని., ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం కోరారు.

అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ సీపీవో, డీపీవో, మున్సిపల్ కమిషనర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వేపై ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుంచి కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నిబద్ధతతో నిష్పక్షపాతంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. సర్వేకు ఒక రోజు ముందు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎలాంటి అపోహలు లేకుండా ప్రజలు కచ్చిత సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వేపై ప్రజలు ఎలాంటి దుష్ప్రచారాలు నమ్మొద్దని పేర్కొన్నారు. ఎలాంటి సందేహాలున్నా ఎంపీడీవో, తహసీల్దార్ల దృష్టికి తేవాలని తెలిపారు. సర్వేకు ఎన్యూమరేటర్లుగా నియమితులైన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, కార్యదర్శులు, డీఆర్డీవో సిబ్బంది మాత్రమే ఇంటింటికి వస్తారని, సర్వేపై ప్రజలకు తప్పుడు సమాచారమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, డీపీవో జయసుధ, సీపీవో అశోక్, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలి

సెర్ప్ సీఈవో, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ అధికారి దివ్య

ఆదిబట్ల, నవంబర్ 9 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు, సిబ్బంది అంకిత భావంతో సర్వే పూర్తి చేయాలని సెర్ప్ సీఈవో, ప్రజావాణి నోడల్ అధికారి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేకాధికారి దివ్య అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో సర్వే ప్రక్రియపై ఆమె రంగారెడ్డి కలెక్టర్‌తో నారాయణరెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని, సర్వేపై ప్రజల్లో ఏమైనా సందేహాలుంటే తక్షణమే నివృత్తి చేయాలన్నారు. ఇచ్చిన ప్రొఫార్మాలో సమాచారాన్ని క్రోడీకరించాలన్నారు. సర్వేలో ఏ ఒక్క కుటుంబాన్ని కూడా విడిచి పెట్టవద్దని, సమగ్రంగా వివరాలు సేకరించాలని ఎన్యూమరేటర్లకు సూచనలు, సలహాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. సర్వే నిమిత్తం అధికారులు సందర్శించినప్పుడు పూర్తి సమాచారంతో ఉండాలన్నారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందు రోజే ఆయా కుటుంబాలకు సమాచారమివ్వాలన్నారు. అనంతరం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. రెండు కుటుంబాలతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగపడేలా సర్వేను నిర్వహిస్తున్నామన్నారు.

కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి దివ్య, కలెక్టర్ నారాయణరెడ్డి

ఇంటి యజమాని సమాచారం మాత్రమే ప్రొఫార్మాలో నమోదు చేయాలి

సర్వేలో ఇంటి యాజమాని ఇచ్చిన సమాచారం మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకుని ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, సీపీవో సౌమ్య, మెప్మా పీడీ మల్లీశ్వరి, డీపీవో సురేశ్‌మోహన్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు పాల్గొన్నారు.

వివరాలు ఎందుకివ్వాలి?

ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయి

సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లకు జనం ప్రశ్నల వర్షం

ఎలాంటి వివరాలు ఇవ్వబోమంటూ ముఖంపైనే చెప్పేస్తున్నవైనం

సిటీబ్యూరో/బంజారాహిల్స్/ముషీరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : సమగ్ర కుటుంబ సర్వే సమరాన్ని తలపిస్తున్నది. వివరాలు ఇవ్వండి అంటూ వెళ్లిన అధికారులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. సర్వే క్వశ్చనెయిర్ చదువుతుంటేనే జనం చికాకు పడుతున్నారు. 'ఏందీ దౌర్భాగ్యం మాకు. వేరే పనేలేనట్టు. వివరాలు ఎందుకివ్వాలి. ఇంతకు ముందు మాకేం కావాలో ప్రజా పాలన దరఖాస్తులు అందించాం కదా. అవన్నీ వట్టివేనా? మళ్లీ గిప్పుడు సమగ్ర కుటుంబ సర్వే అంటూ వచ్చారు. మేం వివరాలు ఇవ్వం. మీరేం చేసుకుంటారో చేసుకోండి. స్టిక్కర్లు కూడా మా ఇంటికి అతికించొద్దు..' అంటూ అధికారులపై జనం మండిపడుతున్నారు. దీంతో సర్వేకు వెళ్తున్న అధికారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. జనం అంతా ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని.. వివరాలు అడిగితే సహకరించడం లేదని ఓ సర్వే బృందం పేర్కొంది. నగరంలో ఎన్యూమరేటర్లకు ఎదురవుతున్న చేదు అనుభవాలతో సమగ్ర కుటుంబ సర్వే ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై జనంలో వ్యతిరేకత వెల్లువెత్తుతుండటానికి ఈ సమగ్ర సర్వేనే ఉదాహరణ అని నిపుణులు చెబుతున్నారు. మొన్నటి వరకు హైడ్రాతో పేదోళ్ల ఇండ్లు కూల్చి.. నిన్న మూసీ నిరుపేదల ఇండ్లను నేలమట్టం చేసిన సంఘటనలతో జనం ఆగ్రహంతో ఉన్న సమయంలో ఇప్పుడు సమగ్ర కుటుంబ సర్వే పేరుతో వివరాలు ఇవ్వాలంటూ వస్తున్న అధికారులపై నగరవాసులు మండిపడుతున్నారు.

స్టిక్కర్లు ఎలా అంటిస్తారంటూ...

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్ డివిజన్లలో మూడురోజుల కిందట ప్రారంభమైన సర్వే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే కార్యక్రమం కొనసాగుతున్నది. అయితే సర్వేలో పాల్గొంటున్న ఎన్యుమరేటర్లకు ఆయా ఇండ్ల యజమానులు సహకరించకపోవడంతో పాటు కిరాయికి ఉన్నవారి ఇండ్లకు స్టిక్కర్లు ఎలా అంటిస్తారంటూ గొడవలకు దిగుతున్నారు. కుల గణన సర్వే అంటూ ఆదాయ వివరాలు, ఆస్తుల వివరాలు, ఆధార్ కార్డుల వివరాలను ఎలా సేకరిస్తారని కొంతమంది తీవ్రస్థాయిలో నిలదీస్తున్నారు. కాగా, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు చెందిన నివాసితులు మరింత తీవ్రంగా ప్రతిస్పందిస్తున్నారు. సర్వే సిబ్బందిని దూషించడంతో పాటు తమ ఇంటిముందు నుంచి వెళ్లకపోతే కుక్కలను వదులుతామని బెదిరిస్తుండడంతో వారంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.3లోని అరోరా కాలనీలో సర్వే కోసం వెళ్లిన టీచర్లపై ఇంటి యజమానులు కుక్కలు ఉసిగొల్పుతామంటూ బెదిరించడం తీవ్ర కలకలం రేపింది. ప్రజల్లో సరైన అవగాహన కల్పించకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఎదురవుతున్నదని సర్వే సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ప్రజాపాలన' ఏమైంది..?

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అంటించేందుకు బస్తీలకు వెళ్తున్న సర్వే సిబ్బందికి స్థానికులు చుక్కలు చూపిస్తున్నారు. 'ప్రజాపాలన అంటూ ఆరు నెలల కిందట దరఖాస్తులు తీసుకున్నారు.. వాటిని ఏం చేశారం'టూ కొంతమంది ప్రశ్నిస్తుండగా, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేస్తే ఇప్పటిదాకా గతి లేదు కానీ మళ్లీ సర్వే అని ఎందుకు వచ్చారంటూ విసుగును ప్రదర్శిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ల గురించి నిలదీయడంతో పాటు బూతులు తిడుతున్నారని, మహిళలు రూ.2500 ఎందుకు ఇవ్వడం లేదని కోపంతో చూస్తున్నారని స్టిక్కర్లు వేసేందుకు వెళ్లిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేస్తున్న వారిలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, టీచర్లు, యూసీడీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిసోర్